


విజయవాడ వదిలి నాసిక్‌కి వెళ్ళి దాదాపు మూడున్నర సంవత్సరాలు దాటింది. నాసిక్‌లోని ఓ భారత ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం రావటంవల్ల, చాలా కాలం శెలవ దొరక్కపోవడంవల్ల విజయవాడతో నాకు తాత్కాలికంగా సంబంధం తెగిపోయింది.

మహారాష్ట్రీ భాష మధ్య మసిలే నాకు నాసిక్‌లోని తెలుగు కుటుంబాలు అనేకం పరిచయం కాబట్టి, హోమ్‌సిక్‌నెస్‌ని భరించ గలుగుతున్నాను.

విజయవాడ నుంచి తరచు నాకు ఉత్తరాలు వ్రాసేది మురళే. ఇంటి నుంచి ప్రతీనెలా చివరి వారంలో ఉత్తరం వస్తుంది డ్రాఫ్ట్ పంపటం మరిచి పోవద్దని. జీతం రాగానే డబ్బు పంపగానే నా గురించి నెలాఖరిదాకా ఇంట్లో ఎవరికీ మళ్ళీ గుర్తు వుండదనుకుంటాను.

మరళీ మాత్రం వారానికో ఉత్తరం రాస్తూంటాడు. ఏది దొరికితే అది నచ్చదు మనిషికి. ఏదిలేదో అది కావాలనిపిస్తుంది. ఈ సూత్రం మా ఇద్దరి విషయంలో నిజం అయింది.

వాడికి విజయవాడ నుంచి దూరంగా ఎక్కడికయినా బదిలీ అయితే బావుణ్ణు అనే కోరిక వుంది. నాకు విజయవాడలోనే ఉద్యోగం దొరికితే చాలు అనిపిస్తుంది.

నాసిక్‌లో ఒకరిద్దరు తెలుగువాళ్ళు-విజయవాడ వాళ్ళు- వెళ్ళి వచ్చి నప్పుడు మాత్రం గుర్తు పెట్టుకుని మా ఇంటికి వెళ్ళి అమ్మ ఇచ్చే ఆవకాయ ఉన్న హార్లిక్స్ సీసాని మాత్రం తెచ్చిపెడతారు.

"మీ అమ్మగారు నీ పెళ్ళి గురించి బాధపడి పోతున్నారోయ్. చేసుకోరాదు" అని రాయబారం మోసుకొస్తారు.

విజయవాడ వదిలిన మూడున్నర ఏళ్ళ తర్వాత తొలిసారిగా మళ్ళీ ఇంటికి వచ్చాను. నే బొంబే వెళ్ళినప్పుడు కొన్న బట్టలు చూసి తమ్ముళ్ళిద్దరు సంతోష పడ్డారు.

"చిక్కిపోయి వుంటావనుకున్నాను. ఫర్వాలేదే?" అన్నది అమ్మ సంతృప్తిగా.

"ఆవకాయ పంపిస్తున్నావుగా" నవ్వాను.

"ఆవకాయతోపాటు పంపే కబురు అందటంలేదా?"

"లేదు."

"నీ ఈడువాడు, మరళీ అప్పుడే పిల్లల్ని చూస్తున్నాడు. వాడికన్నా నీకు ఎక్కువే వస్తుందిగా. చేసుకోరాదూ?"

"వాడు ఇంకో రెండేళ్ళదాకా పెళ్ళి చేసుకోనని రాసాడే నాకు" అన్నాను ఆశ్చర్యంగా.

"చెట్లబజారులో ఎవరినో చూసాడట. నాకు తెలిసింది."

"మురళి నాకు ఉత్తరాలు రాస్తూనే వున్నాడు. ఎప్పుడూ ఆ విషయం రాయలేదే?"

"మురళీతో నీకు వంతేమిటి? అయినా ఈకాలం బ్రహ్మచారులు ఓ పట్టాన పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకోవటంలేదు."

ఆ తర్వాత అమ్మ ఇంటిఖర్చుల గురించి, తనెంత పొదుపుగా సంసారం చేసుకొస్తోంది చెప్పింది. పించను పుచ్చుకుంటున్న నాన్నగారికి ఏ బాదరబందీ లేదు. రోజుకి ఆరు చుట్టలు, రామకృష్ణ మఠంలో ఓ రెండు గంటలు గడపటం మించి ఇంకేమీ పట్టించుకోరు.

సాయంత్రం మురళీ ఇంటికి వెళ్ళాను. ఇల్లు మారారనికి రాసాడా మధ్య. వెదుక్కుంటూ వెళ్ళాను కొత్త అడ్రస్‌కి.

నన్ను చూడగానే గుర్తుపట్టింది మురళి అమ్మగారు.

"కులాసానా? ఎప్పుడు రావటం?" అడిగింది.

జవాబు చెప్పి, ముందు గదిలోని పేముకుర్చీలో కూర్చున్నాను.

"లేడా?" అడిగాను.

"బయటకెళ్ళాడు బేంక్‌నుంచి వచ్చి వస్తాడు. నువ్వొస్తున్నట్లు తెలియదా?" అడిగిందావిడ.

"తెలియదు."

మంచినీళ్ళు తెచ్చిచ్చింది ఆవిడ.

"మురళీ పెళ్ళి గురించి ఇందాక మా అమ్మ చెప్పింది. ఏదయినా సంబంధం సెటిల్ అయిందా?" అడిగాను. అపాటి చనువుంది నాకు మురళి ఇంట్లో.

ఆవిడ వెంటనే మాట్లాడలేదు. కొద్దిగా విచారం కనపడింది. ఆవిడ మొహంలో.

"సంబంధాలు చూస్తున్నారా?" అడిగాను. "వద్దనుకున్నా ఎవరో ఒకరు చెప్తుంటారు. చాలామంది వచ్చి వెల్తున్నారు. ఒక్కటీ నచ్చలేదు వాడికి."

"అదేం?"

"పెళ్ళి చూపులకి వెళ్ళి బయటకి రాగానే నచ్చలేదు అంటున్నాడు. బంగారపు బొమ్మల్లాంటి అమ్మాయిలు కూడా నచ్చటంలేదు నాయనా. అసలు వాడి మనసులో ఏంఉందో మాకయితే అంతుబట్టటం లేదు. కనీసం నువ్వయినా అడుగు నాయనా. వాడికి, నీకు ఏడేళ్ళనుండీ స్నేహితం. కాబట్టి నీకు చెప్తాడు."

"ఒసారి ఉత్తరంలోరాసాడు. ఇంకో రెండేళ్ళదాకా పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యంలేదని" చెప్పాను.

"ఎవరయినా వచ్చి పిల్లనిచూడమని అడుగుతారు. అది సహజం. వాడికా వుద్దేశ్యం లేకపోతే అసలు పిల్లని చూడటానికి ఎందుకు వస్తాడు? ఉద్యోగం చేసే అమ్మాయి కావాలంటాడు ఓసారి. ఇంకోసారి అమ్మాయి పచ్చగా వుండేచాలు. ఉద్యోగం లేకపోయినా ఫర్వాలేదు అంటాడు."

ఆవిడ లోపలకి వెళ్ళిగ్లాసులో కాఫీ తీసుకువచ్చి ఇచ్చిందినాకు.

"చక్కెర సరిపోయిందా?" అడిగింది నేనో గ్రుక్కతాగగానే.

తలవూపాను సరిపోయినట్లుగా. నిజానికి ఎక్కువైంది నాకు.

"విజయవాడలోనే కాదు. చుట్టుప్రక్కల వూళ్ళకి కూడా వెళ్ళాం అనేక సార్లు పిల్లలని చూడటానికి. వీడి విషయమే నాకు దిగులుగా వుంది. పెద్దాడు పిల్లాపాపలతో హాయిగా వున్నాడు. నేనుండగానే వీడినో ఇంటి వాడిని చేస్తేనాకు నిశ్చింత."

కాఫీతాగి ఖాళీగ్లాస్ కిందపెట్టాను.

"నీపెళ్ళి సంగతి ఏమయింది? ఇప్పట్లో చేసుకోవా నువ్వు? భోజనం అదీ బాగుంటుందా అక్కడ? అడిగింది.

"నేనే వండుకుంటున్నా" చెప్పాను.

"అయితే మాత్రం? ఏ వయసులో జరిగే ముచ్చట్లు ఆవయసులోనే జరిగిపోవాలి. ఆలస్యం చేయకు, లక్షణంగా సంపాదించుకుంటూ ఎందు కాలస్యం?"

నవ్వి వూరుకున్నాను.

మరో అయిదు నిముషాల తర్వాత మురళీ వచ్చాడు.

"ఎప్పుడొచ్చావ్? నేరాసినలెటర్ అందిందా?" అడిగాడు విస్మయంగా.

"అందింది అనుకోకుండా వచ్చేసాను."

పావుగంట తర్వాత బయటకి వెళ్ళాంఇద్దరం.

"ఏమిటి విశేషాలు?"అడిగాను.

"అన్నీ రాస్తూనే వున్నానుగా. హైద్రాబాద్ ట్రాన్స్ఫర్ కోసం అప్లికేషన్ పెట్టుకున్నాను. త్వరలో రావచ్చు."

"పెళ్ళి చేసుకోబోతున్నారటగా త్వరలో?" అడిగాను హోటల్ కి వెళ్ళాక.

"ఎవరు చెప్పారు?" అడిగాడు కొద్దిగా ఆశ్చర్యంగా. వెంటనే, మా అమ్మ ఏం మాట్లాడింది?" అడిగాడు.

సర్వర్ రాగానే పెసరట్లు చెప్పాను.

"నువు పెళ్ళి సంబంధాలు చూస్తున్నానని రాయలేదే?" అడిగాను.

"చూస్తున్నాను. అవును."

"మరి ఇంకో రెండేళ్ళదాకా చేసుకునే వుద్దేశం లేని మాట అబద్ధం అన్నమాట."

"కాదు, నిజం."

"అలాంటప్పుడు ఎందుకీ పెళ్ళి చూపులు?"

నవ్వాడు.

"ఇంట్లో బలవంతమా?"

"కాదు."

"మరి?"

"బావుంటుంది."

"ఏమిటి బావుండేది?"

"పెళ్ళి చూపులు."

"నాకర్థంకాలేదు.

ను"వ్వెప్పుడయినా పెళ్ళిచూపులకెళ్ళావా?"

"లేదు."

"అయితే ఈ ట్రిప్‌లో అది కూడా పూర్తి చేయి. అప్పుడు నీకే తెలుస్తుంది."

"ఈలోగా నువు చెప్పు వింటాను."

పెసరట్టు తింటూ చెప్పసాగాడు.

"పెళ్ళిచూపులకు వెళ్తే అదో గమ్మత్తయిన అనుభవం. పెళ్ళికొడుకని ఎంతో గౌరవంగా చూస్తారు. కాఫీ టిఫిన్, పైగా ఓఅమ్మాయిని కూడా చూపిస్తారు. ఒక్కోసారి ఆ అమ్మాయితో మాట్లాడే అవకాశం కూడా లభిస్తుంది. అమ్మాయిని ఏదయినా ప్రశ్నలడగండి. ఫర్వాలేదు అంటారు. ఓ అరగంటపాటు జీవితంలో ఎన్నడూ ఎక్కడాచూడని గౌరవం రుచి చూడవచ్చు. పైగా మనం వెళ్ళిపోయాక కూడా చాలాసేపు మనసులోని మెరిట్స్

గురించి చెప్పుకుంటారు ఫేన్ వేస్తారు. టేబిల్ ఫేన్ గాలి తగిలేలా అమరుస్తారు. కాఫీలో చక్కెర సరిపోయిందా అని రెండు మూడుసార్లు అడుగుతారు...."

ఆశ్చర్యంగా అడిగాను.

"అయితే ఇంతకాలం ఇందుకా నువ్వు పెళ్ళిచూపులకు వెళ్ళేది?"

"మరెందుకనుకున్నావు?"

నేను వెంటనే ఏం మాట్లాడలేదు.

"ఒకసారి పెళ్ళయితే మళ్ళీ పెళ్ళిచూపులనే అవకాశం రాకపోవచ్చు. దోజ్ ఆర్ ప్లెజెంట్ అండ్ ప్రీషియస్ మూమెంట్స్. చూసి చూడనట్టు చూసే ఆడపిల్లలు. దొంగతనంగా చూసే ఆడపిల్లలు, సూటిగా, ధైర్యంగా చూసే అమ్మాయిలు...."

"ఎంతమందిని చూసి ఉంటావ్ ఇప్పటికి?" అడిగాను.

"కనీసం ఓ యాభై మందిని."

"తప్పుకాదా?"

బదులుగా నవ్వాడు.

"వాళ్ళలో కొంతమందయినా నీకు నచ్చలేదని బాధపడివుండరూ. అలా అయిదారుగురు చూసి 'నచ్చలేదు' అంటే వాళ్ళలో ఇదివరకు లేని దిగులు మొదలవదూ? వాళ్ళనావిధంగా హర్ట్ చేయటం మంచిదికాదు." చెప్పాను.

"ఏమో? అయినా సరదగా ఉంటుందికదా కాఫీ తాగుతావా? నేనింకో పెసరట్టు తీసుకుంటాను, నాసిక్ విశేషాలేమిటి? వద్దామనుకుంటున్నాను...."

మురళీ మనసులోని విషయం చెప్పలేదు వాళ్ళ అమ్మగారికి. రెండుసార్లు వెళ్ళినా ఆవిడ కనబడలేదు.

తిరిగి నాసిక్ వెళుతూ రైల్లో మురళి అన్నయ్యకి వుత్తరం వ్రాసాను ఇన్‌లాండ్ లెటర్‌లో, ఆఫీస్ అడ్రస్‌కి.

"....మీకో విషయం రాయాలి తమ్ముడు మురళి గురించి. ఈ ఉత్తరం మీ అమ్మగారికి కూడా చూపించండి...."

(ఆంధ్రభూమి వారపత్రిక 23-12-1978)